
www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 16 అక్టోబర్ 2025
5
తిరుపతి



అంబేద్కర్ యూనివర్సిటీ వీసీగా విజయభాస్కర్‌రావు

ప్రజాశక్తి - క్యాంపస్



అంబేద్కర్ యూనివర్సిటీ ఇన్‌ఛార్జి వీసీగా విజయభాస్కర్‌రావును నియమిస్తూ బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తిరుపతి శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీలో భౌతికశాస్త్ర విభాగాధిపతిగా పనిచేస్తున్న ప్రొఫెసర్ విజయభాస్కర్‌రావు సీనియర్. కూటమి ప్రభుత్వ హయాంలో నెల్లూరు సింహపురి ఇన్‌ఛార్జి వీసీగా ఉన్నారు. అనంతరం ఉన్నత విద్యామండలి వైస్‌ఛైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం కోనసీమ అంబేద్కర్ యూనివర్సిటీ ఇన్‌ఛార్జి వీసీగానూ అదనపు బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది.



భూముల సర్వే (ఫైల్‌ఫోటో)

దామినేడులో జిల్లా 'కోర్టు'
రూ.115.12 కోట్ల నిధులు విడుదల
14 ఎకరాల్లో 16 భవనాలు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

అత్యాధునిక టెక్నాలజీతో తిరుపతి దామినేడులో జిల్లా కోర్టు రానుంది. ప్రస్తుతం వేశాలమ్మ గుడి సమీపంలో ఉన్న జిల్లా కోర్టు స్థలాభావంతో ఇరకాటంగా ఉండడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. రూ.115.12 కోట్ల నిధులను మంజూరు చేసింది. 14 ఎకరాల ప్రభుత్వ భూమిలో 16 అంతస్తుల భవనాలను నిర్మించనుంది. ఇప్పటికే భూసేకరణ పూర్తయింది. త్వరలోనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా భూమిపూజ జరగనుంది.

ప్రస్తుతం తిరుపతి నగరంలోని వేశాలమ్మ గుడి వీధిలో ఉన్న కోర్టు కాంప్లెక్స్ చాలా పాతది. నిర్మాణాలన్నీ బ్రిటీష్ కాలం నాటివి. ఈ భవనాలు శిథిలావస్థలో ఉండడమే కాకుండా, పార్కింగ్ స్థలాల కొరత వెంటాడుతోంది. దీంతో న్యాయవాదులకు కార్యకలాపాలకు ఇబ్బందిగా మారింది. ఈ నేపథ్యంలో తిరుపతి హైకోర్టు రిజిస్ట్రార్ (అడ్మినిస్ట్రేషన్) 2025 జూలై 5, సెప్టెంబర్ 11, 20 తేదీలలో ప్రభుత్వానికి నిధుల కోసం లేఖలు పంపిన తర్వాత, ప్రభుత్వం దీనిపై స్పందించి పై మొత్తాన్ని మంజూరు చేసింది. దామినేడు కోర్టు సముదాయం ఉత్తర్వులు విడుదలయ్యాయి?.ఇది ప్రాంతీయ న్యాయ వ్యవస్థకు పెద్దమైలురాయి కానుంది. మంజూరైన నిధులతో వెంటనే నిర్మాణాలు పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకురావాలని న్యాయశాఖ ముఖ్య కార్యదర్శి ప్రతిభాదేవి తెలిపారు. త్వరలోనే న్యాయశాఖ ఆధ్వర్యంలో టెండర్ ప్రక్రియ మొదలుకానుంది. తుడా ఆధ్వర్యంలో నిర్మాణాలు జరగనున్నాయి.

ఫ్యాక్టరీల్లో 8 గంటలే కొనసాగించాలి

కార్మిక హక్కుల కోసం పోరాడదాం
విద్యుత్ కార్మికుల పోరాటానికి మద్దతు
సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి



మీడియాతో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం కార్మిక వర్గానికి వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని, ఈ విధానాలకు వ్యతిరేకంగా సిఐటియు పెద్దఎత్తున పోరాటాలు చేస్తుందని రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి చెప్పారు. బుధవారం వేమన విజ్ఞాన కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పుత్తూరులో రెండు రోజుల పాటు జరిగిన సిఐటియు జిల్లా 8వ మహాసభ జయప్రదమయ్యిందన్నారు. 240 మంది ప్రతినిధులు పాల్గొన్న మహాసభ పలు తీర్మానాలు చేసిందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానాన్నే ఫ్యాక్టరీల్లో అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 13 గంటలు పెంచడం అన్యాయమన్నారు. రాష్ట్రంలో ఏమాత్రం అభివృద్ధి జరగడం లేదని, అంతా గ్రాఫిక్స్‌మయం అన్నారు. విద్యుత్ రంగంలో కాంట్రాక్టు కార్మికులు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోవడంతో గత నాలుగు నెలల నుంచి ఉద్యమాలు చేస్తున్నారని, రాష్ట్రానికి ప్రధాని వస్తున్నారని సమ్మె చేయవద్దని రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు కార్మికులు సమ్మెను వాయిదా వేశారన్నారు. 17వ తేదీ విద్యుత్ రంగ కార్మికుల సమస్యలపై వారు చేసే పోరాటానికి సిఐటియు మద్దతు ఉంటుందన్నారు. తెలంగాణా తరహాలో విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలన్నారు.

టిటిడిలో పనిచేస్తున్న 16వేల మంది కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ కార్మికులను తక్షణమే రెగ్యులర్ చేయాలని తీర్మానించారు. స్విమ్స్ ఆస్పత్రిలో శానిటేషన్ పేరు స్థానంలో వార్డుబాయిగా చేరుస్తామని హామీ ఇచ్చినా ఇంతవరకూ పట్టించుకోలేదన్నారు. శ్రీవారి మెట్టుచిరువ్యాపారుల సమస్యలు పరిష్కరించాలని 14 నెలలుగా దీక్షలు చేస్తున్నా టిటిడిపట్టించుకోలేదన్నారు. అంగన్‌వాడీల 45 రోజుల పోరాటానికి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. రుయాలో తొలగించిన 50 మంది కార్మికులను తక్షణమే పనుల్లోకి తీసుకోవాలన్నారు. రవాణారంగంలో పనిచేసేవారిని సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు.

ఈ విలేకరుల సమావేశంలో సిఐటియు జిల్లా నాయకులు పి వేణుగోపాల్, బుజ్జమ్మ, గుణశేఖర్, రామకష్ణ, నాగ వెంకటేష్, పార్థసారథి రెడ్డి పాల్గొన్నారు...

సిఐటియు జిల్లా నూతన నాయకత్వం
అధ్యక్ష కార్యదర్శులుగా ఎస్.జయచంద్ర, టి.సుబ్రమణ్యం


సిఐటియు తిరుపతి జిల్లా నూతన కమిటీ ఎన్నికయ్యింది. అధ్యక్షులుగా ఎస్.జయచంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శిగా టి.సుబ్రమణ్యం ఎన్నికయ్యారు. కోశాధికారిగా ఇఎస్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులుగా కందారపు మురళి, జి.బాలసుబ్రమణ్యం, వి.నాగరాజు, కెఎస్ఎస్ ప్రసాద్‌రావు, పి.రామకృష్ణ, ఎస్.వాణిశ్రీ, రమేష్, కె.గుణశేఖర్, వి.చెంగయ్య, కె.వేణుగోపాల్, కార్యదర్శులుగా ఆర్.లక్ష్మి, ఆర్.వెంకటేష్, పి.గురవయ్య, జి.నాగ వెంకటేష్, ఎన్.రఘు, మునిరాజు, ఎన్.మాధవ్‌కృష్ణ, పి.బుజ్జి, లక్ష్మయ్య, రాజేశ్వరి, మరో 58 మందితో కమిటీ ఏర్పాటయ్యింది.



ఎస్.జయచంద్ర
టి.సుబ్రమణ్యం
ఇఎస్ కుమార్

విద్యుత్ షాక్‌తో వ్యవసాయ కూలీ మృతి

ప్రజాశక్తి -ఏర్పేడు



విద్యుత్ షాక్‌తో వ్యవసాయ కూలీ మృతిచెందిన ఘటన గ్రామంలో విషాదఛాయలు నింపింది. కోబాక గ్రామానికి చెందిన దుర్వాస నాయుడు నగిరి నియోజకవర్గంలోని ఎస్ఆర్ పురం మండల సచివాలయం దగ్గర యూరియా కోసం వెళ్లాడు. మోదుగులపాలెం దళితవాడకు చెందిన శ్రీరాములు మరి కొంతమందిని ఆటోలో ఏర్పేడు మండలం నుంచి తీసుకువెళ్లాడు. దుర్వాస నాయుడుకు అక్కడ పొలాలు ఉండడంతో మోదుగులపాలెం దళితవాడ గ్రామస్తులను ఆటోలో తీసుకువెళ్లాడు. మధ్యాహ్నం సమయం ఎస్ ఆర్ పురం సచివాలయం సమీపంలో కుళాయి వద్ద భోజనం తినేందుకు చేతులు కడుక్కునే నిమిత్తం కుళాయి వద్దకు వెళ్లిన కురం శ్రీరాములు విద్యుత్ షాకుకు గురై పడిపోయాడు. 108 అంబులెన్స్ వచ్చి కురం శ్రీరాములు మృతి చెందినట్లు ధృవీకరించి వెళ్లిపోయారు. కోబాక గ్రామం నుంచి తన పని కోసం తీసుకువెళ్లిన దుర్వాస నాయుడు శ్రీరాములు మృతదేహాన్ని నేరుగా స్వగ్రామానికి తీసుకువచ్చి మతుడి ఇంటి వద్ద వదిలి వెళ్లాడు. మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

స్కూల్లో మందు తాగుతూ పట్టుబడిన యశ్వంత్
కొంగరవారిపల్లిలో టెన్త్ విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి - చంద్రగిరి



చంద్రగిరి మండలం కొంగర వారి పల్లి హై స్కూల్లో పదవ తరగతి చదువుతున్న యశ్వంత్ రైలు కింద పడి ముంగళి పట్టు వద్ద ఆత్మహత్య చేసుకొన్నాడు..యశ్వంత్ కొంగర వారి పల్లి హైస్కూల్లో మందు తెచ్చుకుని తాగుతుండగా స్కూల్ పిల్లలు, టీచర్స్ చూసి హెడ్మాస్టర్ వద్దకు యశ్వంత్‌ను తీసుకెళ్లారు. హెడ్మాస్టర్ భాస్కర్ నాయుడు యశ్వంత్ వాళ్ళ తండ్రికి ఫోన్ చేసి రమ్మని చెప్పాడు. అంతలోనే యశ్వంత్ స్కూల్ నుండి పారిపోయి ట్రైన్ కింద పడి చనిపోయాడు. విద్యార్థి ఆత్మహత్య కు గల కారణాలు పూర్తిగా తెలియాల్సి ఉంది. ఇంత చిన్న వయస్సులోనే మందుకు బానిసైన యశ్వంత్ సంబంధించి మానవీయ కోణంలో ఆలోచించి, స్కూళ్లల్లో మత్తుపదార్థాల పట్ల అవగాహన కల్పించాల్సి ఉంది.



శ్రీ బాలాజీ జ్యువెలర్స్ ప్రారంభించిన దివాకర్ రెడ్డి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ



తిరుపతి నగరంలో నూతనంగా శ్రీ బాలాజీ ఫ్యాషన్ జ్యువెలర్స్‌ను తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. స్థానిక తీర్థకట్ట వీధిలోని ఆర్ఎస్ జంక్షన్ పక్కన ఏర్పాటు చేసిన ఫ్యాషన్ జ్యువెలరీ వద్ద విలేకర్లతో మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచానికి తగ్గట్టు, యువత, మహిళలను ఆకర్షించే విధంగా అన్ని రకాల ఫ్యాషన్ జ్యువెలర్స్ ఇక్కడ లభ్యమవుతాయి అన్నారు. ఒక గ్రామ్ గోల్డ్ షైనింగ్ చైన్స్, అన్ని రకాల శుభకార్యాలకు అవసరమయ్యే ఆభరణాలు ఇక్కడ దొరుకుతాయి అన్నారు. ప్రత్యేకించి వివాహాది శుభ కార్యాలకు అద్దె ఆభరణాలు అందిస్తారని, 2000 రూపాయల నుంచి 50 వేల రూపాయల వరకు అద్దె వస్తువులు ఈ షో రూమ్ లో దొరుకుతాయని తెలిపారు. ఇక్కడ లభించే నాణ్యమైన, ఆకర్షణీయమైనా ఆభరణాలను యువత, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫ్యాషన్ జ్యువెలర్స్ అధినేత సిద్ధు రాయల్, కార్పొరేటర్ పొన్నాల చంద్ర, గిరి, సురేష్, దినకర్ పాల్గొన్నారు.

మట్టి మాఫియా కల్పతరువు 'పత్తిగుట్ట'

ప్రతిరోజూ ట్రాక్టర్లతో గ్రావెల్ అక్రమ రవాణా
రాత్రి పగలు తేడా లేకుండా జెసిబితో తవ్వకాలు
చదును చేసిన స్థలంపై అధికార పార్టీ కన్ను
పట్టించుకోని రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి - చంద్రగిరి



ట్రాక్టర్ మట్టి 1000 రూపాయలు.... లేదా ఎనిమిది వందలు... దూరమైతే మరీ ఎక్కువ... ఇలా పకతిని నాశనం చేస్తూ... గుట్టలను ధ్వంసం చేస్తూ అక్రమార్కులు అందినంత దోచుకుంటున్నారు. రాత్రి పగలు అనే తేడా లేకుండా ట్రాక్టర్లను ఏర్పాటు చేసుకుని పత్తి గుట్టను ధ్వంసం చేస్తూ గ్రావెల్ అమ్ముకుంటూ లక్షలు గడిస్తున్నారు. కనీసం రెవిన్యూ అధికారులు పత్తి గుట్ట చుట్టూ కన్నెత్తి చూడడం లేదు. ఇప్పటికే దాదాపు 5 ఎకరాల గుట్టను చదును చేసి అక్కడ ప్లాట్లు వేసి అధికార పార్టీ నాయకులు అమ్మకాలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని వాదనలు వినపడుతున్నాయి. చంద్రగిరి పట్టణం పడమర భాగంలో ఉన్న పత్తి గుట్ట రోజురోజుకూ కనుమరుగైపోతుంది. జెసిబి తో గుట్టను తవ్వుతూ గ్రావెల్ అమ్ముకుంటూ అందినకాడికి దోచుకుంటున్నారు. ప్రతిరోజు రాత్రి పగలు అని తేడా లేకుండా పదుల సంఖ్యలో ట్రాక్టర్లు వందలాది ట్రిప్పులు గ్రావెల్‌ను తరలిస్తున్నాయి. ఇటుక బట్టీలకు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు, ప్రైవేటు వ్యక్తులకు గ్రావెల్‌అమ్ముకుంటున్నారు. లక్షలకు లక్షల రూపాయల సంపాదిస్తూ అడవిని కొల్లగొడుతున్నా రెవెన్యూ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అటవీ శాఖ అధికారులు సైతం అడవి వైపు కన్నెత్తి చూడడం లేదు. దీంతో అక్రమార్కులు ఇష్టారాజ్యంగా దాదాపు 5 ఎకరాల గుట్టను చదులు చేసి గ్రావెల్ అమ్ముకున్నారు. ఇంతవరకూ ఒక ఎత్తయితే ఇక్కడ చదునైన స్థలంపై ఓ అధికార పార్టీ నేత కన్నుబడింది. ఈ స్థలాన్ని ఆక్రమించుకొని ప్లాట్లు వేయాలని స్థానిక రెవెన్యూ అధికారులను సంప్రదించినట్లు విశ్వసనీయ సమాచారం. ఇలా ప్రకతిని నాశనం చేస్తున్న వారిపై చర్యలు తీసుకొని పత్తి గుట్టను కాపాడాలని పలువురు చంద్రగిరి ప్రజలు కోరుతున్నారు.

రుయాలో రూ.2 కోట్ల అభివృద్ధి పనులు



ప్రజాశక్తి -తిరుపతి సిటీ

రుయా ఆసుపత్రిలో రెండు కోట్ల రూపాయల పైచిలుకు వ్యయంతో పలు అభివృద్ధి పనులు చేసేందుకు ఆసుపత్రి అభివద్ధి కమిటీ ఆమోదముద్ర వేసింది. వెంకటేశ్వర రామ్ నారాయణ రుయా జనరల్ ఆసుపత్రి అభివద్ధి మండలి సమావేశం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. శ్రీ వెంకటేశ్వర మెడికల్ కళాశాల కమిటీ హాల్లో జరిగిన సమావేశానికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు విచ్చేశారు. వీరితోపాటు మండలి సభ్యులు లక్ష్మీపతి, కాజా మొహిద్దీన్, కరణం సందీప్ లతో పాటు సూపరిండెంట్ డాక్టర్ రాధ, ఎస్వీ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ రవి ప్రభు హాజరయ్యారు. ఈ సమావేశంలో సుమారు రెండు కోట్ల రూపాయల పైచిలుకు వ్యయంతో రుయా ఆసుపత్రి అభివద్ధికి పలు కార్యక్రమాలకు కమిటీలో ఆమోదించారు. వీటిలో ప్రధానంగా పోస్ట్ ఆపరేటివ్ వార్డులో లీకేజీలు అరికట్టడానికి సుమారు 16.60 లక్షల రూపాయలు, టీబి అండ్ సిడి, ఈ.డీ. హెచ్ వార్డుల్లో నాలుగు లక్షల రూపాయల వ్యయంతో అవసరమైన రిపేర్లు, మరో 10 లక్షల రూపాయల వ్యయంతో కొత్త బ్లాకులో తగిన రిపేర్లు, మెయిన్ ఆపరేషన్ థియేటర్లో 2 లక్షల రూపాయల వ్యయంతో ఫ్లోరింగ్ కి అపాక్షి ట్రీట్మెంట్ చేయడం, అత్యవసర విభాగంలో సెంట్రల్ ఎయిర్ కండిషన్ వ్యవస్థ ఆధునీకరణకు 11.5 లక్షల వ్యయంతో పనులు చేపట్టేందుకు ఆమోదించారు. వీటికి తోడుగా మరో 45 లక్షల రూపాయల వ్యయంతో మూడు అనస్తీసియా వర్క్ స్టేషన్లు, 75 లక్షల రూపాయల వ్యయంతో ఐదు వెంటిలేటర్లు, 15 లక్షల రూపాయలు వ్యయంతో ఐదు మల్టీ దానల్ మానిటర్లు, చిన్నపిల్లల వార్డుల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడినప్పుడు ఇబ్బందిని అధిగమించేందుకు, చిన్నపిల్లల అత్యవసర చికిత్స కు అంతరాయం కలగకుండా 24.50 లక్షల రూపాయల వ్యయంతో యుపిఎస్ ల కొనుగోలుకు కమిటీలో ఆమోదించారు. వీటికి అవసరమైన నిధులను డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ఫండ్స్, కాలేజీ డెవలప్మెంట్ సొసైటీ ఫండ్స్ ల నుండి వినియోగించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ కమిటీలో అనుమతి ఇచ్చారు. తిరుపతి శాసనసభ్యులు ఆరని శ్రీనివాసులు మాట్లాడుతూ ఆసుపత్రి అభివద్ధికి అవసరమైన ప్రతిపాదనలను ముందస్తుగా ఆసుపత్రి అధికారులు సిద్ధం చేసి తన దృష్టికి తీసుకొస్తే, తన వంతుగా అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టుటకు తగిన కృషి చేస్తానని తెలిపారు.

చెకుముకి సంబరాల గోడపత్రిక విడుదల

ప్రజాశక్తి -రేణిగుంట

రేణిగుంట బాలల పాఠశాల నందు చెకుముకి రేణిగుంట మండల అధ్యక్ష కార్యదర్శులు అల్లాబకష్ , కుప్ప స్వామి, పిఎస్ టీచర్ నాగరాజు, హెచ్ఎం శంకరి ఉపాధ్యాయులతో కలిసి చెకుముకి సంబరాల పత్రికను విడుదల చేశారు ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ " 35 సం"లుగా చెకుముకి సంబరాల టాలెంట్ టెస్ట్ ఉమ్మడి రాష్ట్రంలో ఇప్పుడు రెండు రాష్ట్రాల్లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విజ్ఞానాన్ని ,జిజ్ఞాసను , శాస్త్రీయ ఆలోచనలు పెంచే విధంగా కషి చేస్తున్నామన్నారు. .లక్షలాది మంది విద్యార్థులు పాల్గొనే విధంగా చేస్తున్న ఘనత జన విజ్ఞాన వేదికదన్నారు. ఈనెల 18న పాఠశాలల వారీగా, మండలస్థాయిలో నవంబర్ 1వ తేదీ, తిరుపతి లో జిల్లా స్థాయిలో నవంబర్ 23న , రాష్ట్ర స్థాయిలో డిసెంబర్ 13, 14, 15 తేదీల్లో జరుగుతాయని తెలిపారు.

శేషాచలంలో తేనె ఉత్పత్తికి సహకరించండి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)



శేషాచలం అడవులలో ఎన్నో ఔషధ గుణాలు ఉన్న పుష్పాల నుండి తేనెటీగలు ఉత్పత్తి చేసే తేనె ఉత్పత్తికి టిటిడి సహకారం అందిస్తే, రానున్న రోజుల్లో రోగాలను అధిగమించి జీవించడానికి అవసరమైన శక్తి సామర్థ్యాలను పెంపొందించుకొనే అవకాశం ఉందని, ఈ ప్రాజెక్ట్ వలన ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని ఫుడ్ సైంటిస్ట్ డాక్టర్ చెన్నకేశవరెడ్డి తెలిపారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బయట ప్రాంతాలలో ఉత్పత్తి అయ్యే తేనెకు, శేషాచలం అడవులలో ఉత్పత్తి అయ్యే తేనెకు వ్యత్యాసం ఉందని, నేషనల్ హనీ మిషన్ ను ఈ ప్రాజెక్ట్ అమలుకు టిటిడి అనుమతి కోరితే తప్పక సాకారమవుతుందని చెప్పారు. తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు మంచి మెడిసినల్ విలువలు కలిగిన శేషాచలం అడవుల నుండి సేకరించిన తేనెను ఓ ప్రసాదములా అందించగలిగితే వారి ఆరోగ్య సమస్యలు మెరుగు అవ్వడానికి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. శ్రీవారి ఆలయం నుండి పది కిలోమీటర్ల రేడియస్ లో టీటీడీ సొంతంగా ఈ ప్రాజెక్టు ద్వారా ఆధునికంగా తేనె తీసే పద్ధతులను ఉపయోగించి తేనెను ఉత్పత్తి చేయొచ్చన్నారు. నేషనల్ హనీ మిషన్ ద్వారా అనుమతులు, నిధులు మంజూరు అయితే తిరుమల ఆలయానికి చుట్టూ ఉన్న ప్రాంతాల్లో తేనె ఉత్పత్తికి శ్రీకారం చుడతామన్నారు. శేషాచలం అడవుల్లో ఉత్పత్తి అయ్యే తేనెలో ఉండే వైద్య గుణాలను ప్రజలకు వివరించడానికి అవకాశం దొరుకుతుందన్నారు. టీటీడీ, తాను రూపొందించిన ఈ ప్రాజెక్టుకు సహకరిస్తే శేషాచలం అడవుల్లో అరుదైన మెడిసినల్ విలువలు కలిగిన చెట్లనుండి తేనె ఉత్పత్తి జరగడానికి అవకాశం ఉందన్నారు.

ప్రతి నిరుద్యోగికీ ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

ప్రపంచంలో అతిపెద్ద సమస్యగా ఉన్న నిరుద్యోగ సమస్యకు ఉద్యోగ చట్టం సిద్ధాంతం అమలు ఒకటే మార్గమని, ఆంధ్రప్రదేశ్ లో ప్రతి నిరుద్యోగికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని భారతీయ దేశభక్తుల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షులు, న్యాయవాది పోతులూరి మాసుమయ్య అన్నారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం ఉద్యోగ చట్టం సిద్ధాంతాన్ని అమలు చేయాలని కోరుతున్నా పట్టించుకోలేదన్నారు. గత ఎన్నికల్లో పుంగనూరు నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన డాక్టర్ మురళి యాదవ్ ప్రభుత్వ ఉద్యోగ చట్టం సిద్ధాంతం గురించి బీహార్ నేత తేజస్వి యాదవ్ కు చెప్పడంతో వారు ఉద్యోగ చట్టం సిద్ధాంతాన్ని ఎన్నికల హామీలలో ఏర్పాటు చేసుకొని, అధికారంలోకి వచ్చాక ప్రతి నిరుద్యోగికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని ప్రకటించడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. వారు ఎన్నికలలో గెలుపొందాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, విక్రమ్ రాథోడ్, రాజు, సౌందర్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'కె-ర్యాంప్' సినిమా కడుపుబ్బ నవ్విస్తుంది : అబ్బవరం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

సినిమా థియేటర్కు వచ్చే ప్రతి ప్రేక్షకుడిని సినిమా కడుపుబ్బ నవ్విస్తుందని ప్రముఖ హీరో కిరణ్ అబ్బవరం తెలిపారు. కె-ర్యాంప్ చిత్ర ప్రమోషన్ లో భాగంగా దివాలి టూర్ పేరుతో నిర్వహిస్తున్న చిత్ర యాత్ర నాలుగవ రోజు బుధవారం తిరుపతికి చేరుకుంది. స్థానిక ప్రైవేటు హెూటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ తెలుగు ప్రేక్షకుల అభిరుచులు, భావోద్వేగాలను ప్రతిబింబించే సినిమాలే తీయాలని లక్ష్యంగా పెట్టుకున్నానని తెలిపారు. తనను ఎంతగానో ఆదరిస్తున్న ప్రేక్షకులను తాను ఎప్పుడూ గుర్తుంచుకుంటాను. వారి అభిరుచికి తగ్గట్టు, కుటుంబమంతా కూర్చుని చూసే సినిమాలనే తీస్తా అని తెలిపారు. రాబోయే 'కె ర్యాంప్' చిత్రం అందరికీ నచ్చేలా రూపొందించాం. ఈ చిత్రంలో భావోద్వేగం, వినోదం, సందేశం సమపాళ్లలో ఉంటాయి అన్నారు. పూర్తి వినోదభారతమైన ఈ చిత్రం, ప్రేక్షకుల్ని కడుపుబ్బ నవ్విస్తుందన్నారు. ఈ నెల 18వ తేదీన 'కే ర్యాంప్' సినిమా విడుదల కానుందని, ప్రేక్షకులు ఈ చిత్రాన్ని థియేటర్లలో చూసి ఆశీర్వదించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఆ చిత్ర దర్శకుడు జైన్ నాని, చిత్ర బందం పాల్గొన్నారు.



మీడియాతో హీరో కిరణ్ అబ్బవరం

అబ్దుల్ కలాం ఆశయాలు యువతకు స్ఫూర్తి



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

అబ్దుల్ కలాం ఆశయాలను యువత స్ఫూర్తిగా తీసుకొని దేశాభివద్ధికి పాటుపడాలని పలువురు భక్తులు సూచించారు. బుధవారం తిరుపతి-కరకంబాడి మార్గంలోని స్ప్రింగ్ డెల్ పాఠశాలలో భారతరత్న మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం 94వ జయంతిని పురస్కరించుకొని జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్ లర్ ప్రొఫెసర్ ఉమా హాజరయ్యారు. ఈ సందర్భంగా దివాకర్ రెడ్డి మాట్లాడుతూ కలాం గడిపిన నిరాడంబర జీవితం దేశం పట్ల ఆయనకున్న అంకితభావన్ని గుర్తు చేస్తుందన్నారు. ప్రొఫెసర్ ఉమా మాట్లాడుతూ కలాం తపన, ఆత్మవిశ్వాసం, నిజాయితీతో కూడిన సమగ్రత అనే అంశాలను సూత్రాలుగా చెప్పారని, వీటిని విద్యార్థులు తమ జీవితాల్లో పాటించాలన్నారు. సిటీ చాంబర్ అధ్యక్షులు ఆయుబ్ ఖాన్, వ్యవస్థాపక కార్యదర్శి వై.షణ్ముగం మాట్లాడుతూ విద్యార్థుల్లో జాతీయత, విజ్ఞాన స్ఫూర్తిని నింపిన మహనీయుడు అన్నారు. కలాం జయంతి సందర్భంగా విద్యార్థులు కలాం మాస్కులను ధరించి అందరి దష్టిని ఆకర్షించారు. ఈ కార్యక్రమంలో స్ప్రింగ్ డెల్ పాఠశాల అధినేత కేఎస్ వాసు, స్కూల్ ప్రిన్సిపాల్ అనురాధ, సాంబశివరెడ్డి, విశ్రాంత ప్రొఫెసర్లు కరుణానిధి, స్వరాజ్యలక్ష్మి, స్టాన్లీ జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వరల్డ్ స్టూడెంట్స్ డే

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

ఎస్వీయు డిపార్ట్మెంట్ ఆఫ్ అడల్ట్ ఎడ్యుకేషన్ సహకారంతో డాక్టర్ ఆర్ సి రెడ్డి కళాశాలలో వరల్డ్ స్టూడెంట్స్ డే ను ఘనంగా నిర్వహించారు. భారతదేశ శాస్త్రవేత్త, యువతకు ఆశయాలను నింపే ధార్శికులు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంను స్ఫూర్తిగా తీసుకొని యువత తమ లక్ష్యం వైపు అడుగులు వేయాలని ఆర్సి రెడ్డి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ సి రెడ్డి విద్యార్థులకు సూచించారు. అబ్దుల్ కలాం ఇచ్చిన స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని నూతన ఆవిష్కరణతో కూడిన అంశాలను విద్యార్థులు వెలుగులోకి తీసుకోరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ శ్యామ్మోహన్ డేవిడ్, ప్రొఫెసర్ సత్యవతి విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నోటు పుస్తకాల వితరణ

ప్రజాశక్తి - వరదయ్యపాలెం : మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా బుధవారం చెన్నవారిపాలెం ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 45 మంది విద్యార్థిని విద్యార్థులకు బెటర్ ఎడ్యుకేషన్ ఫర్ పూర్ చిల్డ్రన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం నోటు పుస్తకాలు అందించారు. ముఖ్య అతిథి మండల ఎంఇవో సరస్వతి మాట్లాడుతూ పేద విద్యార్థులకు బిపిసి ఫౌండేషన్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు రియాజ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ సభ్యులు రియాజ్, అబ్దుల్లా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునీశ్వరి, ఉపాధ్యాయులు శశి కుమార్ రుశేంద్ర, సుజాత, ఉషారాణి పాల్గొన్నారు.

అండర్ 19 జూడోకు వడమాలపేట విద్యార్థినులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : శ్రీ శ్రీనివాస క్రీడా సమదాయం తిరుపతి వేదికగా ఈ నెల 14వ తేదీ ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో అండర్ 19 జూడో ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టును చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్ సెక్రెటరీ డాక్టర్ బాబు ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. ఈ పోటీలకు హాజరైన పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వడమాల పేట విద్యార్థినులు గీతశ్రీ (9వ తరగతి) 40 కిలోల విభాగంలో, అంజలి (9వ తరగతి) 48 కిలోల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి ఉమ్మడి చిత్తూరు జిల్లా జూడో జట్టుకు ఎంపికయ్యారు. వీరు అక్టోబర్ ఆఖరి వారంలో శ్రీ సత్యసాయి జిల్లాలో ఏపీ రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో నిర్వ హించనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు. వారిని ప్రధానోపాధ్యాయులు కరుణా నవనీతం, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు అభినందించారు. చక్కగా శిక్షణ తీసుకొని రాష్ట్రస్థాయి పోటీలలో రాణించి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు.

పరీక్షల తనిఖీ

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలో (ఫార్మేటివ్ అసెస్ మెంట్-2) పరీక్షలు కొనసాగుతున్న నేపథ్యంలో ఎంఈఓ 2 ముని సుబ్రహ్మణ్యం బుధవారం పలు పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. ముందు వేణుగోపాలపురం పంచాయతీలోని మొక్కలు చేను, కల్లెవెట్టు ఉన్నత పాఠశాల పరీక్షా హాళ్లను పరిశీలించారు. తీసు కుంటున్న జాగ్రత్తలు, విద్యార్థుల హాజరు, సమయపాలన, ప్రశాంత వాతావరణం వంటి అంశాలను సమీక్షించారు. నెలవాయి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం భోజనం నాణ్యతను తనిఖీ చేశారు. వంటశాల, పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలని ఆయాలకు సూచించారు.


జీఎస్‌టీ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న టిడిపి నాయకులు

కరపత్రాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : 'సూపర్ జీఎస్టీ –సూపర్ సక్సెస్' కర పత్రా లను పుత్తూరు మున్సిపాల్టీ 7వ వార్డు గేట్ వీధిలో టిడిపి నాయకులు బుధవారం విడుదల చేశారు. ఇంటింటికీ ప్రచారం నిర్వహించి క్లస్టర్ ఇన్‌చార్జ్ డిఎస్ గణేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఎన్ఎస్ ధనపాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల కష్టాలు తెలుసుకుని జీఎస్‌టీని తగ్గించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిసి సెల్ నాయకులు ఎంవి అన్నలగన్, వార్డు అధ్యక్షులు ఎన్ఎస్ గోపాల్, ఎన్ఎం ఆర్ముగం, చిన్నప్పన్, జయవేళన్, మోహన, అశోక్, వార్డు నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

పిల్లల పోషణ స్థితి మెరుగుకు తోడ్పడాలి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పిల్లలు బరువు ఎత్తు సక్రమంగా వేసి పిల్లల పోషణ స్థితి మెరుగుపడేందుకు తోడ్పడాలని శిశు అభివృద్ధి శాఖ పథకం సంచాలకులు వసంతా బాయి తెలిపారు. పుత్తూరు ప్రాజెక్టు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మహిళా శిశు అభివృద్ధి శాఖ పథక సంచాలకులు వసంత భాయి పిల్లల పోషణ స్థితి మెరుగుకు తోడ్పడాలన్నారు. అనంతరం టాటా ట్రస్ట్ వారి సహకారంతో గ్లోబల్ హ్యాండ్ వాష్ డే ప్రాముఖ్యత తెలిపి ప్రతి ఒక్కరూ చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవలసిన ఆవశ్యకత వివరించారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు ప్రాజెక్టు సిడిపిఓ, సూపర్వైజర్లు, బీపీసీ, డీఈవో పాల్గొన్నారు.

ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌పై అవగాహన

ప్రజాశక్తి-వాకాడు: వాకాడు మండల ఎక్సైజ్ కార్యాలయంలో ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రసాద్ కోట ,చిట్టమూరు, వాకాడు మండలాల మద్యం దుకాణ యజమానులకు ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌పై అవగాహన కల్పించారు. తమ మద్యం దుకాణాలలో కల్తీ మద్యం విక్రయించరాదని తెలిపారు. ప్రతి మద్యం దుకాణంలో ఈ యాప్ ను అందుబాటులో తేవాలని, నకిలీ మద్యం విక్రయిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మద్యం షాపుల యజమానులు, వాకాడు ఎక్సైజ్ ఎస్సై రషీద్, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన విసికి అభినందనల వెల్లువ

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నూతన ఉపకులపతిగా నియమితులైన ఆచార్య టాటా నరసింహారావుని ఎస్వియూ ఎన్ఎంఆర్ ఉద్యోగుల సంఘం నేతలు కలిసి పుష్పగుచ్ఛం, దుశ్శాలువతో ఘనంగా అభినందించారు. వర్సిటీలో ఎన్నో సంవత్సరాలుగా దాదాపు 20 సంవత్సరాలు పైగా ఎన్ఎంఆర్‌లుగా పనిచేస్తున్నామని తమ సేవలను గుర్తించి, సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు విన్నవించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు జి. జయచంద్రబాబు, కార్యదర్శి సిద్దయ్య, కార్యవర్గ సభ్యులు, ఎన్ఎంఆర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి- బాలాయపల్లి: మండలకేంద్రమైన బాలాయపల్లిలో టీడీపీ మండల అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు ఆధ్వర్యంలో జీఎస్టీ తగ్గింపుపై బుధవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేసి జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి ప్రధాన కార్యదర్శి కూను శ్రీహరి, ఎయసీ డైరెక్టర్ తాళ్లూరు ప్రసాద్ నాయుడు, మద్దూరు క్రిష్ణ మావిళ్లపల్లి మాధవనాయుడు, పులకంటి మురళి, తాళ్ల వెంకటేష్, మారెళ్ల వెంకటాద్రి, గుండుబోయిన గోపాల్, ఆర్కాటి ప్రసాద్, జడపల్లి కోటేశ్వరావు పాల్గొన్నారు.

పరాకాష్టకు పరకామణి కథ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): టీటీడీ పరకామణిలో డాలర్ల దొంగతనం చేసిన రవికుమార్ విషయంలో గత ప్రభుత్వ హయాంలోని టీటీడీ బోర్డు నిబంధనలు అన్నింటిని అతిక్రమించి తమ స్వలాభాలకు వాడుకున్నారని, సిఐడి రికార్డులు సీజ్ చేసిన నేపథ్యంలో పరకామణి కథ పరాకాష్టకు చేరిందని టీటీడీ బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి అన్నారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హిందూ దేవాదయ శాఖ నిబంధనలు ప్రకారం టీటీడీ ఎవరిపైనా ఆస్తులు తీసుకోవాల్సి వస్తే దినపత్రికకు ముందుగా పత్రిక ప్రకటన ఇవ్వవలసి ఉంటుందని, ప్రకటన ఇవ్వకుండా 2023 జూన్ 19న టీటీడీ బోర్డు తీర్మానంలో సమయం లేదని రాయడం, 2023 మే 19వ తేదీన రవికుమార్ తన స్థిరాస్తులను టిటిడి స్వీకరించాలని లేఖ రాయడం, దానికి ముందురోజు 18 మే 2023న రవికుమార్ ఆస్తులను టీటీడీ స్వాధీనం చేసుకున్నట్లుగా బోర్డు తీర్మానంలో పేర్కొనడం అనుమానాలు కలిగించే అంశం అన్నారు.

కనిపించని కనీస వసతులు

- నిబంధనలు , నాణ్యత ప్రమాణాలు గాలికి..
- స్పందించని పెట్రోలు బంకుల యాజమాన్యం
- స్పందించని అధికారులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: నేడు ప్రతి కుటుంబంలో ప్రయాణ సౌకర్యార్థం వాహనాలు వినియోగిస్తున్నారు. అయితే వాటి వినియోగానికి అవసరమైన ఇంధనం పెట్రోలు , డీజిల్ విక్రయిస్తున్న బంకుల్లో వాటి నాణ్యత ఎంతో నాణ్యత నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం లేదు. దీనికి తోడు పెట్రోలు బంకుల్లో యజమానులకు కేంద్ర పెట్రోలియం శాఖ నుండి ఆ ప్రాంతంలో వినియోగదారులకు కల్పించా ల్సిన ఏడు రకాల సదుపాయాలు కల్పించాలనే ఖచ్చితమైన నిబంధన వుంది.

కనిపించని కనీస వసతులు

పెట్రోల్ బంకుల వద్ద ఖచ్చితమైన సౌకర్యాలు ఏర్పాటు చేయడం పూర్తిగా విస్మరించారు. తనిఖీలు చేయాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో మౌనం వహిస్తున్నారు. నిబంధనల ప్రకారం సురక్షితమైన ఆర్ఓ వాటర్ సదుపాయం కల్పించాల్సి వుంది. స్వచ్ఛ భారత్ కింద క్లీన్ నెస్ స్త్రీ, పురుషులకు మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలి. అత్యవసర సమాచారానికి ఫోన్ సౌకర్యం, వినియోగదారుల సమస్యలను ఆయిల్ కార్పొరేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు ఫిర్యాదు పెట్టె ఏర్పాటు చేయాల్సి వుంది. వాహన టైర్లలో ఉచితంగా గాలిపట్టే సదుపాయం, ఆయిల్ పరీక్ష నిమిత్తం అందుబాటులో పరీక్ష పరికరం ఉంచాల్సి వుంది. ఐఏ ఏపీ లేని సమయంలో పై స్థాయికి ఫిర్యాదు చేసేందుకు అడ్రస్ ప్రూఫ్ ఆధారం.. ఇన్ని సౌకర్యాలు ఉన్నా ఏ ఒక్కరూ ప్రశ్నించక పోవడంతో యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

నిబంధనలు గాలికి..

వాహనంలో ఆయిల్ నింపుకున్న వారికి ఇవ్వాల్సిన బిల్లు కూడా ఇవ్వడం లేదు. అర్ధరాత్రి వేళ ఆయిల్ పట్టే యంత్రం లో చేర్పులు మార్పులు చోటుచేసుకుంటున్నట్లు సమాచారం. పుత్తూరు, నగరి, వడమాలపేట, పరిసర మండలాల్లో ఇరవై పెట్రోలు బంకులు పైనే వున్నాయి. వీటిలో హిందూస్థాన్, భారత్ పెట్రోలియం, ఇండియన్ ఆయిల్ కంపెనీల పెట్రో లు బంకులు వున్నాయి. ఏ పెట్రోలు బంకులోనూ యాజమా న్యం వినియోగదారులకు కనీస సదుపాయాలు కల్పించడం లేదు. ప్రభుత్వాలు కల్పిస్తున్న సౌకర్యాలు ఎక్కడ? అని నిలదీసినా సమాధానం చెప్పకుండా యాజమాన్యం



దురుసుగా ప్రవర్తించినా, వ్యంగంగా మాట్లాడినా అందుబాటులో ఉన్న ఆయిల్ కంపెనీ టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాల్సి వుంది.

స్పందించని అధికారులు

పెట్రోలు బంకుల్లో ఆయిల్ నాణ్యత, వసతుల కల్పనపై సివిల్ సప్లై అధికారులుగా తనిఖీలు చేపట్టి తగు చర్యలు తీసుకోవాల్సి వుంది. అయితే సంబంధిత శాఖాధికారులు ఎలాంటి తనిఖీలు నిర్వహించిన దాఖలాలు కనిపించ డంలేదు. వీటిపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం వుంది.

క్రైం న్యూస్


ఫారెస్టు అధికారులు స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు, వాహనాలు

ఎర్రచందనం పట్టివేత

వాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు, యర్రావారిపాలెం: భాకరాపేట ఫారెస్ట్ రేంజ్ అధికారి వెంకటరమణకు అందిన రహస్య సమాచారం మేరకు రెండు వేర్వేరు ప్రాంతాల్లో తమ సిబ్బందితో నిర్వహించిన దాడుల్లో ఎర్రచందనం దుంగ లతో పాటూ వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు భాకరాపేట ఫారెస్ట్ రేంజ్ అధికారి తెలిపారు. కార్యాలయంలో జరిగిన స్థానిక విలేకరుల సమావేశంలో అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీ ఎర్రావారి పాలెం మండలం కోడవాండ్లపల్లి పరిసర ప్రాంతాల్లో నిర్వహించిన దాడుల్లో 315 కేజీల బరువు కలిగిన పది ఎర్రచందనం దుంగలతో పాటు ఒక టవేరా వాహనాన్ని, వలస రెడ్డి గారి పల్లి సమీపంలో నిర్వహించిన దాడుల్లో నూటా అరవై ఐదు కేజీల బరువు కలిగిన ఐదు ఎర్రచందనం దుంగలతో పాటు ఒక టాటా విస్తా వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దాడులను పసికట్టిన స్మగ్లర్లు వాహనాలను, దుంగలు వదిలి పారిపోయారన్నారు. రెండు వాహనాలు, దుంగలతో సహా వీటి విలువ రూ.25 లక్షలు వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎఫ్‌బిఓలు వై రాజేష్ కుమార్, ఎం సదా శివయ్య, జి ప్రదీప్ చాంద్, సిరవి , జేబీ నిఖిల్, డ్రైవర్లు హెచ్ శంకర్, ఎన్ రోహిత్ తోపాటు ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారన్నారు. పారిపోయిన స్మగ్లర్లను పట్టుకునేందుకు గాలిస్తు న్నామని పేర్కొన్నారు.

కఠినచర్యలు తప్పవు: ఎస్ఐ

ప్రజాశక్తి -రామచంద్రాపురం: టపాకాయల విక్రయదారులు అనుమతి లేకుండా విక్రయిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ భక్తవత్సలం హెచ్చరించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో టపాకాయల విక్రయానికి అనుమతులు తప్పని సరిగా పొందాలని, అనుమతులు లేకుండా అమ్మితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్లో ఆయన మీడియా సమావేశంలోమాట్లాడుతూ తప్పనిసరిగా లైసెన్స్ దారులు మాత్రమే బాణా సంచాలను విక్రయించాలన్నారు. గ్రామాలలో పిల్లలు టపాకాయలు పేల్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఇతర ప్రాంతాల నుండి అనుమతులు లేకుండా టపాకాయలను తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. తల్లిదండ్రుల పర్యవేక్షణలోనే పిల్లలు టపాకాయలు కాల్చాలని సూచించారు. ఎలాంటి నిబంధనలు పాటించకున్నా చర్యలు తప్పవని హెచ్చరించారు.

'డానియెలి' పరిశ్రమకు పలు అవార్డులు

ప్రజాశక్తి - వరదయ్యపాలెం: క్వాలిటీ సర్కిల్ ఫోరం ఆఫ్ ఇండియా తిరుపతి చాప్టర్ నిర్వహించిన 'చాప్టర్ కన్వెన్షన్ ఆన్ క్వాలిటీ కాన్సెప్ట్స్ పోటీలలో అత్యున్నత నాణ్యత పనితీరుకు శ్రీసిటీ లోని డానియెలి ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ నాలుగు గోల్డ్ అవార్డులు, ఒక సిల్వర్ అవార్డును గెలుచుకుంది. దీంతో పాటు విశిష్ట నాయకత్వ ప్రతిభకు డానియెలి కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ పి శ్రీనివాసరావుకు "ట్రాన్స్‌ఫార్మేషనల్ లీడర్‌షిప్ అవార్డు" ప్రదానం చేశారు. ఆయన సామర్థ్యం, దార్శనికత, పటిష్ట నాయకత్వ లక్షణాలకు అవార్డు దక్కింది. ఇది శ్రీసిటీకి గర్వ కారణం అని వ్యాఖ్యానించిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, డానియలి యాజమాన్యం, సిబ్బందికి అభినందనలు తెలిపారు.

రైతులకు యూరియా కార్డులు పంపిణీ

ప్రజాశక్తి -కోట : కోట మండలంలోని కోట రైతు సేవ కేంద్రంలో యూరియా పంపిణీ కార్డుల పంపిణీ నిర్వహించారు. ఏఎంసీ చైర్‌పర్సన్ దారా ప్రమీల చేతుల మీదుగా రైతులకు యూరియా కార్డుల పంపిణీ చేశారు. వ్యవసాయ అధికారి సుచేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి రైతుకు తాము సాగు చేస్తున్న వరి ఎకరాకు 3 బ్యాగులు యూరియా విడతల వారీగా అందిస్తామన్నారు. ప్రస్తుతం కోట మండలంలోని అన్ని ఎరువుల దుకాణాలలో 341 మెట్రిక్ టన్నుల యూరియా అందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు పలగాటి భాస్కర్ రెడ్డి, తిరుపతి పార్లమెంట్ మైనారిటీ అధ్యక్షులు షేక్ జలీల్ అహ్మద్, నెల్లూరు. మోహన్ రెడ్డి, మారంరెడ్డి శ్రీధర్ రెడ్డి,కోటా రెడ్డి, కొకర్ల మధు యాదవ్ పాల్గొన్నారు.

18న ధన్వంతరీ జయంతి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం) : ధన్వంతరీ జయంతిని పురస్కరించుకొని ఈనెల 18న తిరుపతి నగర పరిధిలోని గాంధీ రోడ్డులోని మంగళ భజన మందిరం నుండి గాంధీభవన్ వరకు మేళ తాళాలతో నాయీ బ్రాహ్మణ సోదర సోదరీమణులు శోభాయాత్రలను నిర్వహించనున్నట్లు నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆవులపాటి బుజ్జి బాబు తెలిపారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన ఈ విషయం తెలిపారు.

మన ఆరోగ్యం..మన చేతుల్లో..


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి రూరల్ (తొట్టంబేడు): మండలంలోని చియ్యవరం పంచాయతీలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో బుధవారం గ్లోబల్ హ్యాండ్ వాషింగ్‌డే సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు దేవేంద్ర మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతిరోజు ముఖ్యమైన ఏడు సందర్భా లలో చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవడం అలవాటుగా మార్చుకోవాలన్నారు. విద్యార్థులు ప్లే కార్డులతో నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుహాసిని, గంగారావు, రాజేంద్రప్రసాద్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

బాలికలకు అవగాహన

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: 'భేటీ బచావో భేటీ పడావో..'లో భాగంగా సచివాలయాలలో, గ్రామాలలో ప్రజలకు 'ఆడపిల్లలను కాపాడుకోవాలి'పై అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా బుచ్చినాయుడు కండ్రిగ మండలం కనమనం బేడులోని ఏకలవ్య రెసిడెన్షి యల్ స్కూలులో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆరోగ్య అధికారి డిఎన్ వెంకటేశ్వర్లు, సూపరువైజర్ జ్యోతి, ఆరోగ్య సిబ్బంది పిల్లలకు అవగాహన సదస్సు నిర్వహించారు. మూఢనమ్మకాలు, ఆడపిల్లల భవిష్యత్తుపై భయం, భ్రూణ హత్యలు తదితరా లను అరికట్టాలన్నారు. ఆడ పిల్లలు రేపటి సమాజానికి మూల స్తంభాలు అని, ఆడ పిల్లలు లేకపోతే మానవాళి ఉండదని సూచించారు. అబ్బాయిల వలే అమ్మాయిలను విద్యా వంతులు గా తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త విధానంలో యూరియా పంపిణీ

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని రైతులకు ఎరువుల సరఫరా సక్రమంగా నిర్వ హించేందుకు వ్యవసాయ శాఖ కొత్త కార్డు విధానాన్ని ప్రవేశపెట్టిందని మండల వ్యవసాయ అధికారి షణ్ముగం పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ యూరియా అవసరమైన రైతులు తమ ఒరిజినల్ ఆధార్, పాస్‌బుక్‌లతో రైతు సేవా కేంద్రానికి హాజరై కార్డు పొందవచ్చన్నారు. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ రైతు వివరాలు నమోదు చేసి కార్డు అందిస్తారని ఈ కార్డుతో రైతులు రైతు సేవా కేంద్రం లేదా ప్రైవేట్ ఎరువుల దుకాణాల్లో యూరియా పొందవచ్చన్నారు.

పార్టీని బలోపేతం చేయాలి

వైసిపి కార్యకర్తలకు పెద్దిరెడ్డి, భూమన పిలుపు


మాట్లాడుతున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి


ప్రజాశక్తి -చంద్రగిరి: గ్రామ స్థాయిలో పార్టీని బలో పేతం చేయాల్సిన అవసరం ఆసన్నమైందని, ప్రతి గ్రామంలో జగనన్న సైనికులు తయారు కావాలని వైసిపి రీజనల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి, ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆ పార్టీ కీలక నేతలు, ప్రముఖులు హాజరైన సమావేశానికి చంద్రగిరి నియోజక వర్గం తరపున చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి హాజరయ్యారు.

వైసిపి నాయకులకు నివాళి

ప్రజాశక్తి -చంద్రగిరి: చంద్రగిరి పట్టణంలోని వైసిపి సానుభూతి పరులు ఇంట విషాదం చోటు చేసుకుంది.విషయం తెలుసుకున్న ఉమ్మడి చిత్తూరు జిల్లా వైసిపి విద్యార్థి విభాగం అధ్యక్షులు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి నివాళులు అర్పించారు. చంద్రగిరి రెడ్డివీధికి చెందిన నారంగారి సిద్ధమ్మ ఆకస్మికంగా మృతి చెందారు. ఆమె భౌతిక కాయానికి చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం సిద్ధమ్మ కుమారుడు నారంగారి మదన్ మోహన్ రెడ్డిని పరామర్శించారు. చంద్రగిరికి చెందిన వైసిపి బీసీ నేత పండ్లూరి మునిరత్నం అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన భౌతిక దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆ కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు.

జిడిఎస్‌లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ గూడూరు డివిజన్ పరిధిలోని గ్రామీణ తపాలా ఉద్యోగుల ధర్నా గూడూరు హెడ్ పోస్టాఫీసులో నిర్వహించారు. జిడిఎస్ హక్కుల కోసం పోరాడినందుకు జనరల్ సెక్రటరీ ఎస్ఎస్ మహాదేవయ్య, సర్వీస్ నుండి తొలగించడాన్ని నిరసిస్తూ ఆర్డర్ ని వెంటనే రద్దు చేసి విధుల లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో డివిజన్ సెక్రటరీ గోపాల్, సర్కిల్ అసిస్టెంట్ మల్లిఖార్జున, పెన్షనర్ సెక్రటరీ . సుధాకర్, . సుబ్బరామయ్య పాల్గొన్నారు.



డీన్, డీఎస్‌ఏలకు ఘన సన్మానం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయంలో నూతనంగా పశు వైద్యవిశ్వవిద్యాలయం డీన్ గా బాధ్యతలు గా స్వీకరించిన ప్రొఫెసర్ ఆర్‌విసురేష్ కుమార్‌ని, విశ్వవిద్యాలయ డీన్ ఆఫ్ స్టూడెంట్స్ అఫైర్స్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ వైకుంఠ రావుని ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఉప్పర నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా దుశ్శాలువతో వెటర్నరీ పరిపాలన భవనంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ బీసీ విభాగం అధ్యక్షులు విజయ్, గిరి నాయక్, ముస్తఫా, చిద్విలాస్ పార్థసారథి, ధనుంజయులు, మధు, ఇతర విద్యార్థులు పాల్గొన్నారు.



పేటశ్రీకి సాహితీ పురస్కారం

ప్రజాశక్తి - క్యాంపస్ : ఆచార్య పేట శ్రీనివాసులు రెడ్డి రచించిన 'తిరుపతి కథలు' పుస్తకానికి సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం వచన రచనల్లో సాహితీ పురస్కారాన్ని ప్రకటించింది. 2023 సంవత్సరంలో వచ్చిన తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల ఉత్తమ గ్రంథాలకు తెలుగు విశ్వవిద్యాలయం ఈ సాహితీ పురస్కారాలను ప్రకటించింది. ఈ నెల 29న హైదరాబాద్‌లో నాంపల్లి ప్రాంగణంలోని నందమూరి తారక రామారావు కళా మందిరంలో పురస్కారాలను ప్రదానం చేస్తారు. 20,116 నగదును అందజేసి సత్కరిస్తారు. 2014లో పేటశ్రీ తెలుగు విశ్వ విద్యాలయం వారి కీర్తి పురస్కారాన్ని కసైతం అందుకొన్నారు. ఇప్పటికి జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలను అందుకొన్న పేటశ్రీ దాదాపు 10 దేశాల సదస్సుల్లో పాల్గొని పరిశోధనా పత్రాలను సమర్పించారు. 25 పుస్తకాలను, మూడు వందలకు పైగా వ్యాసాలను ప్రచురించి, వందలాది సదస్సుల్లో పాల్గొన్నారు.

ఆరు చోట్ల బాణసంచా కేంద్రాలకు అనుమతి



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజనల్ పరిధిలో ఆరు చోట్ల బాణా సంచా విక్రయ కేంద్రాలకు తాత్కాలిక అనుమతులు జారీ చేసినట్లు శ్రీకాళహస్తి ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం బాణా సంచా దుకాణాల ఏర్పాటుపై తాత్కాలిక లైసెన్స్ దారులతో సమావేశం నిర్వహించారు. ఈనెల 17 వ తేదీ నుంచి 21 వరకు నిబంధనలు అనుగుణంగా విక్రయాలు చేసుకోవాలని ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి సూచించారు. శ్రీకాళహస్తిలో జూనియర్ బాలికల కళాశాల ఆవరణంలో 14 షాపులు, ఏర్పేడులో వికృతమాల, పాపా నాయుడు పేట, ఏర్పేడు మండల కేంద్రంలో షాపులు ఏర్పాటుకు అనుమతించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీలు నరసింహమూర్తి, శ్రీనివాసరావు, ఫైర్ స్టేషన్ అధికారి నాగేశ్వరరావు, టూ టౌన్ సీఐ నాగార్జున రెడ్డి, పలువురు తహశీల్దార్లు పాల్గొన్నారు.

సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించాలి

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపు విద్యుత్ బిల్లులు చెల్లించాలని ట్రాన్స్‌కో ఏఈ చలపతి తెలిపారు. బుధవారం బుచ్చినాయుడు కండ్రిగలో విద్యుత్ బిల్లులు చెల్లించని దుకాణదారుల వద్ద సిబ్బందితో కలసి బిల్లుల చెల్లింపులు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల విద్యుత్ వినియోగదారులు సకాలంలో బిల్లులను చెల్లించి సహకరించాలని కోరారు. సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించకపోతే సర్ ఛార్జీతోపాటు అపరాధ రుసుంతో చెల్లించావల్సి ఉంటుందన్నారు. వ్యవసాయ బోరు మోటార్లకు సంబంధించిన బిల్లులను చెల్లించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ చంగల్ రాయులు పాల్గొన్నారు.

అన్ని దానాల్లోకెల్లా అన్నదానం మిన్న

మయూరి శ్యామ్ యాదవ్


అన్నదానం చేస్తున్న దాతలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : అన్ని దానాల్లో కెల్లా అన్నదానం మిన్న అని శ్రీ కృష్ణా సేవా సమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్ యాదవ్ పేర్కొన్నారు. బుధవారం గుడూరు పట్టణంలోని గమళ్ల పాలెం లోని ఓం సాయిరాం వృద్ధాశ్రమంలో మయూరి శ్యామ్ యాదవ్ సాయంతో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మయూరి శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మయూరి శ్యామ్ సతీమణి మహేశ్వరి, హోమ్‌టేకర్ కల్యాణి పాల్గొన్నారు.

మామిడి రైతుల హర్షం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మామిడి రైతులకు టన్నుకు నాలుగు వేల చొప్పున మంజూరు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు రైతులు హర్షం వ్యక్తం చేశారు. వడమాలపేట మండలం సీతారాంపురంలో రైతులు మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇచ్చిన మాట ప్రకారం రైతులకు డబ్బులు వారి వారి ఖాతాలో జమచేయడం ఆనందంగా వుందన్నారు. ఈ కార్యక్రమంలో హరిప్రసాద్ నాయుడు, దేవా నాయుడు. మామిడి రైతులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం జీవితం స్ఫూర్తిదాయకం: ఎంఈవో

ప్రజాశక్తి - చంద్రగిరి: మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం నేటి యువతకు స్ఫూర్తి దాయకమని ఎంఈవో ఎస్ లలితకుమారి పేర్కొన్నారు. అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని చంద్రగిరి బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో వే ఫౌండేషన్ ఏర్పాటు చేసిన అబ్దుల్ కలాం విగ్రహానికి లలిత కుమారి, ప్రధానోపాధ్యాయులు వెంకట రమణ రెడ్డి, వే ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టరు పైడి అంకయ్య, ఇంపాక్ట్ రీజినల్ క్లబ్ ప్రెసిడెంట్ తహసున్నిసా బేగం పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డాక్టరు పైడి అంకయ్య మాట్లాడుతూ అబ్దుల్ కలాం ఆశయాలను భవిష్యత్తు తరాలకు అందించాలన్న సమున్నత లక్ష్యంతో ప్రత్యేకంగా ఈ ప్రాంగణంలోనే ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఇంపాక్ట్ రీజినల్ ప్రెసిడెంట్ తహసున్నిసా బేగం, ఇంపాక్ట్ ట్రైనర్ మాధవి, నల్లం నరేంద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

నారాయణలో ప్రోత్సాహిత్- 2025

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం విద్యార్థులలో సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యం, పరిశోధనాత్మక దృక్పథాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో మినీ ప్రాజెక్ట్ ఎక్స్పో పోటీ నిర్వహించారు. ఈ ప్రాజెక్ట్ ఎక్స్పో లో వివిధ కళాశాల నుంచి, నారాయణ ఇంజనీరింగ్ కళాశాల నుంచి 1800 మంది విద్యార్థులు పాల్గొని 480 ప్రాజెక్ట్స్ పెట్టారు. ఈ ప్రాజెక్ట్ ఎక్స్పో కి ముఖ్య అతిథిగా పికె కృష్ణ ప్రసాద్ జనరల్ మేనేజర్ ప్రాజెక్ట్స్ డిఎస్ఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు వి రవి ప్రసాద్ విద్యార్థులతో ప్రాజెక్టుల గురించి మాట్లాడారు. డీన్ డాక్టరు విశ్వక్సేన రెడ్డి ఈ కార్యక్రమం విద్యార్థులకు పరిశ్రమ అవసరాలను అర్థం చేసుకునే అవకాశం కల్పించడమే కాకుండా, కొత్త ఆవిష్కరణలకు వేదికగా నిలుస్తుందని తెలిపారు. డైరెక్టర్ డాక్టరు దత్తాత్రేయ శర్మ, కృష్ణ ప్రసాద్ ఉత్తమ ప్రాజెక్టులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. ఏర్పాట్లు, సౌకర్యాలు నారాయణ ఇంజనీరింగ్ కాలేజీ ప్రాజెక్ట్ ఎక్స్పో కన్వీనర్ శివకుమార్ , ఏవో కొండారెడ్డి , కళాశాల సిబ్బంది ఏర్పాటు చేశారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి -దొరవారిసత్రం : సూళ్లూరుపేట నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే తమ ధ్యేయమని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. బుధవారం మండలం పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ అధికారులతో ఆమె సమావేశం అయ్యారు. నియోజకవర్గం అభివృద్ధితో పాటు మండల అభివృద్ధి, మున్సిపాలిటీల అభివృద్ధి గురించి అధికారులతో ఆమె చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ కిరణ్మయి, తహశీల్దారు సైలకుమారి, ఎంపీడీఓ గోవర్ధన్ పాల్గొన్నారు.

క్వాలిటీ ఒక భావన కాదు..సంస్కృతి

ఐఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): విద్యారంగం, పరిశ్రమల మధ్య అభివృద్ధికి క్వాలిటీ సర్కిల్ ఫోరమ్ ఆఫ్ ఇండియా కృషి చేయాలని, క్యూసిఎఫ్ఐ తిరుపతి 11వ వార్షిక ముగింపు సభలో తిరుపతి ఐఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణ పేర్కొన్నారు. తిరుపతి-కరకంబాడి మార్గంలోని ఎస్విసిఈ కళాశాలలో వార్షిక మహాసభ ముగింపు కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ కృష్ణయ్య మాట్లాడారు. పరిశ్రమల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ బాధ్యత కలిసి సాగాలన్నారు. పరిశుభ్రమైన సాంకేతికతలు, సమర్ధవంతమైన వ్యర్థ నిర్వహణ, హరిత ఉత్పత్తి విధానాలను అనుసరించడం ద్వారా మాత్రమే స్థిరమైన అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. క్యూసిఎఫ్ఐ తిరుపతి చాప్టర్ పర్యావరణ పరిరక్షణకు చేసే అవగాహన కార్యక్రమాల పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ అభినందించారు. విద్యారంగం, పరిశ్రమల మధ్య వారధిగా ఉంటూ విశిష్ట సేవలు అందించినందుకు క్యూసిఎఫ్ఐ గల్లా రామచంద్ర నాయుడుకు లైఫ్ టైం మట్టి అచీవ్మెంట్ అవార్డును ప్రదానం చేశారు. క్యూ సిఎఫ్ఐ తిరుపతి చాప్టర్ చైర్మన్ గుడ్లూరు జగన్మోహన్ మాట్లాడుతూ 2015లో స్థాపించిన తిరుపతి చాప్టర్ 75 టీంలతో ప్రారంభమై నేటికీ 100కు పైగా చేరుకోవడం సంతోషంగా ఉందన్నారు. ప్రముఖ సిఎక్స్ఓలు, పరిశ్రమదిపతుల నిపుణులతో సలహా కమిటీ ఏర్పాటు, శ్రీ సిటీ, నెల్లూరులో క్వాలిటీ కంట్రోల్ మిషన్ కోఆర్డినేటర్ల నియామకం, వార్షిక సదస్సును విస్తరింపజేసే నిర్ణయాలను తెలిపారు.

సిఎస్‌సిలో టెలి - లా సేవలు సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా మేనేజర్

ప్రజాశక్తి - వరదయ్యపాలెం : ఇకపై సిఎస్ సి సెంటర్లో న్యాయపరమైన సేవలు కూడా ప్రారంభిస్తున్నట్లు సిఎస్ సి జిల్లా మేనేజర్ సతీష్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరానికి టెలి-లా ప్రోగ్రామ్ కోసం న్యాయ శాఖ (డి ఓ జె), భారత ప్రభుత్వం , సి ఎస్ సి ఇ-గవర్నెన్స్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్ ఒక మెమోరాండం ఆఫ్ అసోసియేషన్ (ఎం ఓ ఏ)పై సంతకం చేశాయి. న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ సమక్షంలో ఈ సంతకం జరిగిందని ఈ చొరవతో భారతదేశం అంతటా పౌరులకు ఉచిత ప్రీ-లిటిగేషన్ చట్టపరమైన సహాయాన్ని అందించడం, గ్రామీణ, అణగారిన వర్గాలపై ప్రత్యేక దృష్టి సారించడం, అందరికీ అందుబాటులో , సరసమైన న్యాయం లభించేలా చూడటం లక్ష్యంగా పెట్టుకుంది.

న్యాయ సలహాలు ఎలా పొందవచ్చు?

సమీప కామన్ సర్వీస్ సెంటర్ (సిఎస్‌సి)ని సందర్శిస్తే అక్కడ ఉన్న గ్రామ స్థాయి వ్యవస్థాపకునికి మీ సమస్య తెలిపితే కేసు రిజిస్టర్ చేస్తారన్నారు. తరువాత న్యాయవాదుల ద్వారా న్యాయ సలహాలిచ్చి మీ సమస్యను పరిష్కరించి మీ కేసు పూర్తి చేస్తారన్నారు.

ఏ సలహా అయినా పొందవచ్చు

కట్నం , కుటుంబ వివాదాలు,గృహ హింస, లైంగిక వేధింపులు, భూసమస్యలు మహిళలు, పిల్లలు , సీనియర్ సిటిజన్ల నిర్వహణ, నేరపూరిత సమస్యలు , షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలపై దారుణాలు వంటి ఇతర చట్టపరమైన విషయాలు పై విషయాలపై అన్నిటికీ సిఎస్ సి సెంటర్‌లో సేవలను పొందవచ్చని ఆయన తెలిపారు.

వేదాంత విభాగ విద్యార్థికి వేదాంత రత్న బిరుదు

ప్రజాశక్తి - క్యాంపస్: జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం శ్రీపరమా చార్య గురుకుల కేంద్ర విద్యార్థి వరదరాజన్ శర్మకు కాంచీ వేదవేదాంత శాస్త్రసభ ద్వారా అద్వైత వేదాంత శాస్త్రంలో సుప్రసిద్ధ తెనాలి పరీక్షలో ఉత్తీర్ణత సాధించి, స్వశాస్త్ర ప్రతిభా ప్రదర్శనం చేసి, శాస్త్ర జ్ఞానాన్ని చక్కగా సంపాదించినందుకు కంచి కామకోటి పీఠాధిపతులు శంకర విజయేంద్ర సరస్వతీ చేతుల మీదుగా అద్వైత వేదాంత రత్న బిరుదును అందించారు. వరదరాజన్ శాస్త్ర ప్రతిభను వారు ప్రశంసించారు. శాస్త్ర అధ్యయనంతో పాటు శాస్త్ర సంరక్షణకు కృషి చేయాలని వారు సూచించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఆర్ కృష్ణమూర్తి, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం పరమాచార్య గురుకుల కేంద్రం డైరెక్టర్ అద్వైత వేదాంత విభాగ అధ్యక్షులు ప్రొఫెసర్ కె గణపతి భట్, చక్కటి శాస్త్ర నిష్ణాతులుగా తయారు చేసిన గురువులు అద్వైత వేదాంత విభాగ ఆచార్యులు శ్రీహరి శివరామ దాయగుడే, అద్వైత వేదాంత విభాగ ఆచార్యులు ప్రొఫెసర్ సతీషకెఎస్, విభాగ అధ్యాపకుల తరపున వరదరాజన్ కు అభినందనలు తెలిపి సన్మానించారు.

సచివాలయం ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-వాకాడు: ఎంపిడివో సాయి ప్రసాద్ బాలిరెడ్డిపాలెం సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ సిబ్బంది తప్పనిసరిగా హాజరు పట్టికలో నమోదు చేయాలని తెలిపారు. ఏమైనా అత్యవసర పరిస్థితి ఏర్పడినప్పుడు సంబంధిత పంచాయతీ కార్యదర్శికి తెలిపి మూమెంట్ రిజిస్టర్ లో తప్పనిసరిగా నమోదు చేసి వెళ్లాలని తెలిపారు. సచివాలయానికి సంబంధించిన పలు రిజిస్టర్లు, రికార్డులు వెరిఫై చేశారు. సచివాలయానికి వస్తున్న ప్రజలకు ఎటువంటి అసౌకర్యానికి గురికాకుండా ప్రభుత్వ పథకాలు వారికి అందేలా చూడాలని కోరారు. ఎటువంటి అవినీతి మరియు అలక్ష్యం వహించకుండా పనిచేయాలని, పని పట్ల శ్రద్ధ వహించాలని మండలాన్ని జిల్లా పరిధిలో ప్రథమ స్థానానికి తీసుకురావాలని సిబ్బందికి సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ తనిఖీ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి రమేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత 'బ్యూటీ ప్రాక్టీషనర్' పై శిక్షణ

ప్రజాశక్తి -చంద్రగిరి: యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ చంద్రగిరిలో అక్టోబర్ 22 వ తేదీ బుధవారం నుండి 35 రోజుల పాటు పూర్తి ఉచితంగా జూనియర్ బ్యూటీ ప్రాక్టీషనర్' పై మహిళలకు శిక్షణ ప్రారంభిస్తున్నామని సంస్థ డైరెక్టర్ పి సురేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన చిత్తూరు, తిరుపతి జిల్లా గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 సంవత్సరాల నుండి 50 సంవత్సరాల మధ్య వయసు కలిగిన నిరుద్యోగ మహిళలు "జూనియర్ బ్యూటీ ప్రాక్టీషనర్' శిక్షణకు అర్హులు అన్నారు. కనీస విద్యార్హత 10 వ తరగతి చదివి ఉండవలెను. శిక్షణ సమయంలో ట్రైనీస్ కి ఉచిత భోజనం కల్పిస్తామన్నారు. శిక్షణా పూర్తి చేసుకున్న వారికీ ధృవపత్రాలు కూడా ఇస్తామన్నారు. శిక్షణా తీసుకోదలచిన వారు ఆధార్ కార్డు, రేషన్ కార్డు జెరాక్స్ కాపీలు, 4 పాసుపోర్టు సైజు ఫొటోలతో సంస్థకి వచ్చి వారిపేరు నమోదు చేయించుకోవాలని సూచించారు.

చెవిరెడ్డి కేసులో హైకోర్టు తీర్పుపై సుప్రీం అసంతృప్తి

బెయిల్ విచారణపై హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు రద్దు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ఏపీ మద్యం అక్రమ కేసులో హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. హైకోర్టులో బెయిల్ రద్దు పిటీషన్లు తేలేంత వరకు ఏసీబీ కోర్టులో బెయిల్‌పై విచారణ జరపరాదన్న తీర్పును సుప్రీంకోర్టు కొట్టేసింది. బెయిల్ రద్దు, బెయిల్ పిటీషన్లను మెరిట్ ఆధారంగా నిర్ణయించాలని హైకోర్టుకు సూచించింది. ఈ కేసులో వ్యక్తిగత స్వేచ్ఛ ఇమిడి వుందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. బెయిల్ కేసులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించింది. బెయిల్ విషయంలో వెయిట్ చేయించాలనే అంశం మంచిది కాదని పేర్కొంది. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 21ను ఉల్లంఘించడమే అవుతుందని అభిప్రాయపడింది. సుప్రీంకోర్టు. బెయిల్ రద్దు, బెయిల్ మంజూరు పిటీషన్లను మెరిట్ ఆధారంగానే నిర్ణయించాలని చెప్పిం ది. మద్యం అక్రమ కేసులో అరెస్టయిన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కేసుపై సుప్రీంకోర్టులో బుధవారం విచారణ చేప ట్టారు. జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ కేవీ విశ్వనాథన్ లతో కూడిన ధర్మాసనం చెవిరెడ్డి పిటీషన్‌ను విచారించింది. అక్రమ మద్యం కేసులో దాఖలైన బెయిల్ పిటీషన్లను విచారణ చేయవద్దని హైకోర్టు ఇచ్చిన తీర్పుపై ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. బెయిల్ పిటీషన్లకు ప్రాధాన్యతను కల్పించి నిర్ణయం తీసుకోవాలని, వ్యక్తిగత స్వేచ్ఛతో ముడిపడిన బెయిల్ పిటీషన్లపై హైకోర్టు ఇలాంటి ఉత్తర్వులు ఇవ్వడానికి సహేతుకమైన అంశాలు ఏవీ తమకు కనిపించడం లేదని ధర్మాసనం తేల్చి చెప్పింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం ఒక వ్యక్తి వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలగకుండా చూడాలని, బెయిల్ అంశంలో దానిని తప్పక పాటించాలని సూచించింది. మద్యం అక్రమ కేసులో బెయిల్‌పై విడుదలైన మిథున్‌రెడ్డి బెయిల్‌ను రద్దు చేయాలని ఏపీ ప్రభుత్వం తరపున సిట్ అధికారులు హైకోర్టులో పిటీషన్ దాఖలు చేసి వున్నారు. ఆ పిటీషన్‌లోని అంశాలను ఆధారంగా చేసుకుని నిర్ణయాలు తీసుకోవాలే కానీ మిథున్ రెడ్డి బెయిల్ పిటీషన్‌పై నిర్ణయం తీసుకునే వరకు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డితో పాటు మిగతా సహ నిందితుల బెయిల్ పిటీషన్లపై విచారణ చేయరాదన్న ఉత్తర్వులు ఇవ్వడం సరికాదని సర్వోన్నత న్యాయ స్థానం హితవు పలికింది. దీంతో విజవాడ ఏసీబీ కోర్టులో చెవిరెడ్డి బెయిల్ పిటీషన్లపై గురువారం వాదనలు జరగనున్నాయి. ఆ వాదనలు ముగిసిన తరువాత అక్కడి న్యాయమూర్తి తమ నిర్ణయాన్ని ప్రకటించనున్నారు. ఈ కేసుతో బెయిల్ పిటీషన్లపై ఏపీ హైకోర్టుకు సర్వోన్నత న్యాయస్థానం ఒక కీలక సూచన చేసింది.

నాయీ బ్రాహ్మణులను ఆదుకోవాలి

టిడిపి రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సాధికార సమితి అధ్యక్షులు వైద్యం శాంతారామ్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: రాష్ట్రంలోని నాయీ బ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సాధికార సమితి అధ్యక్షులు, తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులు వైద్యం శాంతారాం తెలిపారు. తిరుపతిలోని వేమన విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర టిడిపి నాయి బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర కార్యవర్గ సమావేశం అధ్యక్షులు వైద్యం శాంతారాం అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యం శాంతారాం మాట్లాడుతూ రాష్ట్రంలోని నాయి బ్రాహ్మణులంతా ఐక్యంగా పోరాడితే ఎలాంటి సమస్యనైనా పరిష్కరించుకోవచ్చన్నారు. ఈసారి టిడిపి రాష్ట్ర కమిటీలో నాయీ బ్రాహ్మణులకు ఐదుగురికి చోటు కల్పించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళతానని చెప్పారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలలో కమ్యూనిటీ భవనాల కోసం కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ చూపుతామన్నారు. సెలూన్ షాపులకు ఇప్పుడు ఇస్తున్న 200 యూనిట్లకు మించి మరో 200 యూనిట్లుకు పెంచేలా కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్త 1200 దేవాలయాలలో నాయీ బ్రాహ్మణులకు పాలక మండలి లలో చోటు కల్పించారన్నారు. ఈనెల 18వ తేదీన నాయీ బ్రాహ్మణుల ధన్వంతరి జయంతిని విజయవాడలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు టిటిడి పాలకమండలి సభ్యులు వైద్యం శాంతారాం తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర క్షౌర వృత్తిదారుల సంఘం అధ్యక్షులు గంగులప్ప పాల్గొన్నారు.

సర్క్యులర్ ఎకానమీ పై విస్తృత ప్రచారం చేయాలి

ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మెన్ కృష్ణయ్య

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: సర్క్యులర్ ఎకానమీ పై విస్తృత ప్రచారం చేయాలని అని, వ్యర్థమే వనరు -సర్క్యులర్ ఎకానమీ ద్వారా పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత అని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మెన్ కృష్ణయ్య తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఆంధ్రప్రదేశ్ సర్క్యులర్ ఎకానమీ, వేస్ట్ రీసైక్లింగ్ పాలసీ (4.0) 2025-30 పై బ్రెయిన్ స్టార్మింగ్ సెషన్ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మెన్ కృష్ణయ్య, మున్సిపల్ కమిషనర్ మౌర్య, కాలుష్య నియంత్రణ మండలి ఈ ఈ రాజశేఖర్ తో కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ హాజరు అయ్యారు.

యూనియన్ బ్యాంకుకు కన్నం

ప్రజాశక్తి- నాగలాపురం: నాగలాపురం ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలోని యూనియన్ బ్యాంకులో బుధవారం వేకువజామున దుండగులు చోరీకి విఫలయత్నం చేశారు. బ్యాంకు వెనుక వైపున ఉన్న సిమెంటు గోదాము షట్టర్లు తెరచి లోపల గోడకు కన్నం వేసి బ్యాంకులోకి ప్రవేశించారు. బ్యాంకులోని సీసీ కెమెరాలు, అలారం కనెక్షన్లు కట్ చేశారు. బ్యాంకు మేనేజర్ నాగ మునీంద్ర నాయక్ చోరీ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

గూగుల్ రాకతో రాష్ట్రం అభివృద్ధి: టిడిపి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : యువతకు ఉపాధి కల్పించాలనే సంకల్పంతో ఒకవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు, మరోవైపు మంత్రి లోకేష్ అహర్నిశలు శ్రమించి ప్రపంచ ప్రసిద్ధి కంపెనీలను రాష్ట్రానికి తీసుకువస్తున్నారని టిడిపి నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు పులిమి శ్రీనివాసులు , గూడూరు మండలం అధ్యక్షులు కొండూరు వెంకటేశ్వర్లు రాజు, పార్లమెంట్ అధికార ప్రతినిధి బిల్లు చెంచురామయ్య, క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు తాతపూడి ఇశ్రాయేలు కుమార్, రాష్ట్ర లైవ్ స్టాక్ డైరెక్టర్ గుండాల లీలావతి, జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులు ఏసుపాక పెంచలయ్య, తక్కెళ్లపాటి చంద్రమౌళి, యువత అధికార ప్రతినిధి వేముల సునీల్, బాబు పాల్గొన్నారు.

కమిషనర్‌ను కలిసిన జిల్లా జేశాప్ క్రికెట్ జట్టు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(జేశాప్) తిరుపతి, చిత్తూరు ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు బుధవారం సాయంత్రం కార్పొరేషన్ కమిషనర్ మౌర్యను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్ అనంతపురంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జర్నలిస్ట్ ప్రీమియర్ లీగ్ - 2025 విజేతగా నిలిచిన ఉమ్మడి తిరుపతి, చిత్తూరు జిల్లా జట్టును అభినందించారు. టోర్నీలో రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి పాల్గొన్న 16 జట్లలో తిరుపతి జిల్లా జట్టు ఛాంపియన్స్‌గా నిలవడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని విజయాలు అందుకోవాలని ఆమె పేర్కొన్నారు. అడిగిన వెంటనే జిల్లా జట్టుకు తన సహాయ సహకారాలు అందించిన కమిషనర్ కు జేశాప్ జిల్లా నాయకులు జిల్లా జట్టు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేశాప్ జిల్లా అధ్యక్షులు విజయ్ యాదవ్, ప్రధాన కార్యదర్శి హరిబాబు, జిల్లా జట్టు కెప్టెన్ శ్రీనివాసులు, క్రీడాకారులు మనోహర్, జగదీష్, సురేష్, శేఖర్, తుకారం, సతీష్,శ్రీనివాసులు, సాయి, ప్రసాద్ పాల్గొన్నారు.

హెల్త్ సెంటర్ పరిశీలన



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతిగా బాధ్యతలు చేపట్టిన ఆచార్య తాతా నరసింగరావు విశ్వవిద్యాల యంలోని వివిధ సంస్థలను అధికారికంగా పరిశీలిస్తున్నారు. నిన్న మధ్యాహ్నం ఆకస్మికంగా బాలుర భోజనశాలను పరిశీలించి, విద్యార్థులను అడిగి అక్కడి వాతావరణం గురించి విచారించి, అక్కడే విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. బియ్యం, నూనె వంటి సామగ్రి నాణ్యత పరిశీలన చేసి అసంతృప్తి వ్యక్తం చేశారు.

జిల్లా మహాసభను విజయవంతం చేయండి: పిడిఎస్ఓ

ప్రజాశక్తి - క్యాంపస్ : ఈ నెల 17వ తేదీ గవర్నమెంట్ యూత్ హాస్టల్ లో నిర్వహించనున్న పిడిఎస్ఓ 'తిరుపతి జిల్లా మహాసభ'ను విజయవంతం చేయాలని కోరుతూ ఎస్ వి యూనివర్సిటీ మెయిన్ గేట్ వద్ద పిడిఎస్ఓ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించామన్నారు. పిడిఎస్ఓ తిరుపతి జిల్లా కార్యదర్శి ఆర్.ఆష మాట్లాడుతూ విద్యాకేంద్రంగా పేరుగాంచిన తిరుపతి మహా నగరంలో ప్రభుత్వ విద్య పూర్తిగా పాలకుల నిర్లక్ష్యానికి గురవుతోందన్నారు. ఎటు వెతికినా ప్రభుత్వ బడుల జాడ కనపడక ప్రైవేటు, కార్పొరేట్ బడులు మూడు పువ్వులు, ఆరు కాయలుగా విలసిల్లుతున్నాయి. తిరుపతి నగరంలో ఒకే ఒక్క ప్రభుత్వ పాఠశాల వుందని, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు అసలే లేవన్నారు. టిటిడి విద్యాసంస్థలు ఉన్నప్పటికీ వీటిల్లో రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది మంది విద్యార్థులు చేరటానికి ఆసక్తి చూపటంతో స్థానిక విద్యార్థులకు అడ్మిషన్లు దొరకటం లేదన్నారు. దీంతో మిగిలిన స్థానిక, స్థానికేతర విద్యార్థులకు ప్రైవేట్, కార్పొరేట్ బడులే దిక్కవుతున్నాయన్నారు. జిల్లా అధ్యక్షులు దేవేంద్ర మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన నియమ, నిబంధనలు ప్రైవేటు యాజమాన్యాలు పాటిస్తున్నాయా? లేదా అన్న పర్యవేక్షణ విద్యాశాఖ అధికారులు చేయటం లేదన్నారు. దీంతో అనేక ప్రైవేటు, కార్పొరేటు యాజమాన్యాలు ఐడి కార్డులు, పుస్తకాలు, యూనిఫాంల పేరిట అధిక ఫీజులు, డొనేషన్లు వసూలు చేస్తూ నాణ్యతలేని విద్యను విద్యార్థులకు అందిస్తున్నాయని అనేక ప్రభుత్వ నియమ, నిబంధనలను తుంగలో తొక్కుతున్నాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో విద్యారంగ సమస్యలపై కార్యక్రమాన్ని రూపొందించుకోవడానికి జిల్లా మహాసభను ఏర్పాటు చేస్తున్నామని, ఈ సభకు విద్యార్థులు, మేధావులు, ప్రజాతంత్ర వాదులు పాల్గొనాలని కోరారు.